## క్లుప్తంగా

### రక్తదాతకు జాతీయ పురస్కారం




తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రోషన్

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన రెడ్‌డ్రాప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెహమాన్ కుమారుడు రక్తదాత టి.రోషన్‌ను యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ సేవా పురస్కారంతో సత్కరించింది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో 22 సంవత్సరాల్లోనే 16 సార్లు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న రోషన్‌కు తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్ యంగ్ ఇండియన్ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అతడిని తోటి రక్తదాతలు అభినందించారు.

### జాబ్ మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన యువతతో అధ్యాపక బృందం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 94 మంది యువకులకు ఉద్యోగాలు లభించినట్లు కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహిళా సంఘాలతోనే ఆర్థిక ప్రగతి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

బుక్కరాయసముద్రం: మహిళా సంఘాలతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో 27వ వార్షిక మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘాల ద్వారా ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం మండల సమాఖ్య కమిటీని ఎన్నుకున్నారు. బీకేఎస్ చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలిగా నాగలక్ష్మి (బీకేఎస్), ఉపాధ్యక్షురాలిగా మాబ్బి (ఎల్‌బీ నగర్), కార్యదర్శిగా మంగమ్మ (భద్రంపల్లి) సహాయ కార్యదర్శిగా నారాయణమ్మ (రేకులకుంట) కోశాధికారిగా రేణుక ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నారాయణస్వామి, సీసీలు ఈశ్వరయ్య, అన్నపూర్ణ, ఇందిరమ్మ, నారాయణస్వామి, అకౌంటెంట్ పుష్పావతి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పరిహారం



ఏ.కొండాపురంలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంత్ బాబు

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం గ్రామం మీదుగా చేపడుతున్న 544 డీ రోడ్డు విస్తరణ పనుల్లో భూమిని, ఇళ్లను కోల్పోయిన కొంతమందికి పరిహారం అందజేశామని, పరిహారం అందకపోతే ఆధారాలతో వినతులు ఇవ్వాలని అనంతపురం ఆర్డీఓ వసంత్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని ఎ.కొండాపురంలో నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు సంబంధించి కొంతమంది రైతులకు పరిహారం చెల్లించామన్నారు.అనంతరం రోడ్డు విస్తరణ పనులను హైవే అథారిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీఓ ఆదేశాలతో రైతుల నుంచి గ్రామ సభ ద్వారా సాయంత్రం వరకూ అధికారులు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### అపరిచిత ఫోన్ కాల్స్‌తో అప్రమత్తం

గార్లదిన్నె: అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లు, లింక్స్ రావడం, ఎక్కువయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ కాల్స్ వస్తే కట్ చేసి 1903 సైబర్ క్రైం నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

# అక్రమార్కుల చెరలో 'పెన్నా'

- పెన్నానదికి గర్భశోకంగా మారిన ఆక్రమణలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు




తాడిపత్రి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి సాగు చేసిన వరి, పండ్ల తోటలు

తాడిపత్రి రూరల్: పట్టణ, పరిసర గ్రామాలకు వరప్రసాదిని అయిన పెన్నానది ఆక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. రోజు రోజుకూ ఆక్రమణలు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణల వల్ల పెన్నానదిలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. గతంలో కేవలం అడుగు లోతులో నీళ్లు ఉండేవి. నేడు వందల అడుగుల లోతులో కూడా నీరు పడటం లేదు. అక్రమార్కులు పెన్నానదిని ఆక్రమించుకుని వివిధ రకాల తోటలను సాగు చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు అలాంటి తోటలకు కనెక్షన్ మంజూరు చేస్తూ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారు. గతంలో పెన్నానది దాదాపు 500 మీటర్ల వెడల్పు ఉండేది. కొన్ని చోట్ల ప్రస్తుతం కేవలం వంద అడుగుల వెడల్పు కూడా లేదంటే ఏ స్థాయిలో ఆక్రమణలు జరిగాయో అర్థమవుతోంది. గతంలో పెన్నానదిలో సర్వే చేసిన రెవెన్యూ అధికారులు దాదాపు 2 వేల ఎకరాలు ఆక్రమణ జరిగిందని తేల్చారు. కానీ వివిధ రకాల ఒత్తిడుల వల్ల కేవలం నోటీసులతోనే సరిపెట్టుకున్నారు. అయితే అనధికార లెక్కల ప్రకారం ఐదు వేల ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయని సమాచారం.

**మున్సిపాలిటీతో పాటు ఫ్యాక్టరీలు, పంచాయతీలకు పెన్నా ప్రాణాధారం**

పట్టణ సమీపంలోని పెన్నానది పరిసర ప్రాంతాల్లోని గ్రానైట్, కడప స్లాబ్ ఫ్యాక్టరీలు, మండలంలోని పరివాహక ప్రాంతంలోని పంచాయతీలకు పెన్నానది ప్రాణాధారంగా ఉంటోంది. తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు లక్షన్నర మంది జనాభా నీటి అవసరాలను పెన్నానది తీరుస్తోంది. వందలాది ఫ్యాక్టరీలు కేవలం పెన్నానది కారణంగా ఇక్కడకు వచ్చాయి. గతంలో పెన్నానదిలో పుష్కలంగా నీటి వనరులు ఉండటంతో మున్సిపాలిటీలో ప్రజలకు రోజూ రెండు పూటలా నీరు అందించేవారు. ప్రస్తుతం ఆక్రమణల కారణంగా పెన్నానదిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రోజు మార్చి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం గండికోట నీటిని అదనంగా అందిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలకు అవసరమైన నీటిని భూగర్భ జాలాలు అందించకపోవడంతో.. వాడిన నీటిని తిరిగి ఉపయోగిస్తూ నానా తంటాలు పడుతున్నాయి.

**సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు**

పలువురు అక్రమార్కులు నదిని ఆక్రమించి తోటలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అనంతరం వాటిని ఇసుక అక్రమ తవ్వకాల కోసం లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాడిపత్రి మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇరువైపులా ఉన్న గ్రామాలకు చెందిన వారు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అందులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక నాణ్యతను బట్టి తాడిపత్రికి చెందిన కొందరు వ్యక్తులు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్తులో ఇసుక అవసరాల కోసం ఉపయోగపడుతుందన్న ఆలోచనలో కొనుగోలు చేస్తున్నారు. మరి కొందరు అవకాశాలను బట్టి ఇసుకను విక్రయించడానికి ఎదురు చూస్తున్నారు.

**ఆక్రమణలు తొలగించాలి**



పెన్నానదిలో ఆక్రమణలు తొలగించడం వల్ల భూగర్భ జాలాలు పెరుగుతాయి. రోజు రోజుకు ఆక్రమణలు పెరుగుతున్నాయి. అక్రమణల వల్ల పెన్నానదికి వరద వస్తే పట్టణంలోని నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో పలు మార్లు పెన్నానదిలో ప్రవాహం పెరిగి పట్టణంలోకి వరద నీరు వచ్చింది.

– కుమారస్వామి, తాడిపత్రి

**ఫ్యాక్టరీలకు దెబ్బ**



పెన్నానదిలో పెరుగుతున్న ఆక్రమణల వల్ల పరిసర ప్రాంతాల్లోని వివిధ రకాల ఫ్యాక్టరీ యజమానులకు తలనొప్పిగా మారింది. ఫ్యాక్టరీలకు అవసరమైన నీటి అవసరాలను పెన్నానది తీర్చలేకపోతోంది. భూగర్భ జాలాలు అడుగంటి పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– సాయి క్రిష్ణ, తాడిపత్రి

**ఆక్రమణలపై సర్వే చేయిస్తాం**



పెన్నానది ఆక్రమణలపై సిబ్బందితో సర్వే చేయిస్తాం. కొత్తగా తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నా. మండలంపై అవగాహన చేసుకుంటున్నా. పెన్నానది పరివాహక ప్రాంతంలో పర్యటించి ఏ మేరకు ఆక్రమణలు జరిగాయో తెలుసుకుని, ఆక్రమణదారులకు నోటీసులు పంపుతాం.

– రజాక్‌వలి, తహసీల్దార్

### ఓటరు జాబితా అందజేత



కలెక్టర్‌కు ఓటరు జాబితా అందజేస్తున్న డీటీ

తాడిపత్రి రూరల్: జిల్లా కేంద్రంలో మంగళవారం కొత్త ఓటరు జాబితా వివరాలను కలెక్టర్ వినోద్ కుమార్‌కు తాడిపత్రి ఎన్నికల డిప్యూటీ తాహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్ అందజేశారు. గతంలో నియోజకవర్గంలో 2, 48,781 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,23,442 మంది, మహిళలు 1,25,313 మంది, ట్రాన్స్‌జండర్లు 26 మంది ఉండేవారు. ప్రస్తుతం 2,49,047 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,23,513, మహిళలు1,25,509 మంది, ట్రాన్స్‌జండర్లు 25 మంది ఉన్నారు. కాగా తాడిపత్రి నియోజక వర్గంలో కొత్తగా 9 వేల మంది ఓటర్లు పెరిగారు.

### విద్యా సామగ్రి పంపిణీ

యాడికి: మండల కేంద్రంలోని నంబర్ – 4 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాయలచెరువు గ్రామానికి చెందిన అజయ్ 8వ వర్ధంతి సందర్భంగా అతడి మిత్రబృందం పలకలు, బలపాల బాక్సులు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు రంగస్వామి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అజయ్ మిత్రులు నవీన్ కుమార్, రవి కుమార్, నజరుద్దీన్, మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

పుట్లూరు: పుట్లూరు, యల్లనూరు మండలాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోమటికుంట్ల సమీపంలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో బుధవారం మరమ్మతులు చేపడతామన్నారు. ఈ మరమ్మతుల కారణంగా పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సలకంచెర్వులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

శింగనమల: వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏలు వెంకటరాముడు, శైలజాకుమారి సూచించారు. మంగళవారం మండలంలోని కల్లుమడి గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏలు మాట్లాడుతూ వరి సాగులో మెలకువలు, సాగు విధానాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు రావడానికి తీసుకోవల్సిన చర్యలను వివరించారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి ట్రైసైసిలోజల్ కలిపి పిచికారి చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ గుళికలు వేసుకోవాలన్నారు. నత్రజని ఎరువులు అధికంగా వాడవద్దన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అంతర పంటలు బార్డర్ క్రాప్, ట్రాప్ క్రాప్, పంటలను వేసుకోవాలని, వాటి వల్ల ఉపయోగాలను వివరించారు. ఎరువులు యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓలు అన్వేష్‌కుమార్, శ్రీనివాసులు, ఏఈఓలు అక్కమ్మ, ప్రసాద్, వీఏఏ నవీన్, ఎంపీఈఓ నారాయణ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో రైతులు పంటల సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అగ్రికల్చర్ విద్యార్థులు రైతులకు సూచించారు. శింగనమల మండలంలోని సలకంచెరువు, సోదనపల్లి గ్రామాల్లో మంగళవారం ఎస్.ఎస్ వ్యవసాయ కళాశాల మార్కాపురం, ఎస్‌వీవీఆర్ అగ్రికల్చర్ బద్వేల్ విద్యార్థులుఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.శశికళ, పశు సంరక్షణ అధికారి డాక్టర్ మాధవి, సర్పంచ్ ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, గుత్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధనుంజయ మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రవేశపెడతానని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగు నెలలయినా ఇంత వరకూ ఆచరణకు నోచుకోలేదన్నారు. జూనియర్ కాలేజీల్లో వెంటనే మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వసతి దీవెన, ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ లలితకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వర్, మధు, మనోజ్, పవన్, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి**

గుంతకల్లు రూరల్: విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యదవ్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేవీవీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు వచ్చిన కారణంగా తహసీల్దార్‌ను సత్కరించారు.

**భోగేశ్వరాలయం తనిఖీ**



గర్భగుడి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఆలయాల డిప్యూటీ స్థపతి నెహ్రూ

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయాన్ని మంగళవారం రాష్ట్ర ఆలయాల డిప్యూటీ స్థపతి నెహ్రూ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయనను ఆలయ కమిటీ ప్రెసిడెంట్ ఎస్.మురళీధర్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ మంత్రోచ్చారణల నడుమ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ గర్భగుడి నిర్మాణ పనులపై సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట డిప్యూటీ అసిస్టెంట్ స్థపతి సుబ్రమణ్యం, ఆలయ ఏఓ హరిత, ఈఓ క్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు వడ్డే వెంకట్రాముడు, ఆర్ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మరువ వంక పరిశుభ్రతకు చర్యలు**

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న మరువ వంక పరిశుభ్రతకు సర్పంచ్ పార్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు బీకేఎస్ చిక్కవడియార్ చెరువులోకి భారీగా చేరింది. దీంతో మరోసారి వర్షం వస్తే బీకేఎస్ చెరువు మరువ పారేందుకు సిద్ధంగా ఉన్నందున సర్పంచ్ పార్వతి మరువ పారే ప్రాంతంలో జేసీబీతో శుభ్రం చేసి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

**ఘనంగా గురు ద్వాదశి పూజలు**

పామిడి: పట్టణంలోని మహాయోగ దత్తపీఠంలో మంగళవారం గురు ద్వాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. దత్తవతారంలో తొలి అవతారమైన శ్రీపాద శ్రీ వల్లభులు కృష్ణానదిలో కురువపురంలో అంతార్థనమైన రోజున ఈ పూజలు చేస్తారని సురేంద్ర మహారాజ్ తెలిపారు.

**అధికారులకు సన్మానం**

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బదిలీ అయిన ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలక్రిష్ణను సన్మానించారు. అలాగే ఇక్కడకు బదిలీపై వచ్చిన ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి , సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మధుసూదన్ రావు, ప్రజాప్రతినిధులు, అనధికారులు పాల్గొన్నారు.

**కారు బోల్తా.. దంపతులకు గాయాలు**

ప్యాపిలి: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని పోతుదొడ్డి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. యాడికి పట్టణానికి చెందిన దంపతులు మహమ్మద్, రఫిక కర్నూలులో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పోతుదొడ్డి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలింది. దీంతో కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది. కారులో ఉన్న దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో .. చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ సునీల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## కౌన్సిలర్లకు కనీస ప్రొటోకాల్ ఇవ్వండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



మాట్లాడుతున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: 'పట్టణంలోని 37 వార్డుల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లు ఇంకా పదవిలోనే ఉన్నా.. ప్రభుత్వ కార్యక్రమాల్లో కౌన్సిలర్లకు కనీస ప్రొటోకాల్ ఇవ్వడం లేదు.. పెన్షన్ల పంపిణీ మొదలు అన్నింటిలోనూ టీడీపీ వార్డు ఇన్‌చార్జ్‌ల జోక్యం అధికమైంది. వార్డు సచివాలయ ఉద్యోగులపై వారి పెత్తనం ఏంటి?' అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వీసీ నైరుతిరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేలా సచివాలయ సిబ్బందికి సూచించాలన్నారు. పట్టణంలో పేద ప్రజలకిచ్చిన స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ నయీమ్ అహ్మద్ స్పందిస్తూ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి కౌన్సిలర్ల ద్వారానే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ కౌన్సిలర్ విద్యారాణి మాట్లాడుతూ తన వార్డులో కూడా టీడీపీకి చెందిన ఓ వ్యక్తి వార్డు ఇన్‌చార్జ్ అని చెప్పుకుంటూ సచివాలయ సిబ్బందిపై అజమాయిషీ చేస్తున్నాడని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రొటోకాల్ పాటించేలా సచివాలయ సిబ్బందిని ఆదేశించాలని ఆమె విన్నవించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ లింగన్న మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం సంక్షేమానికి సున్నా చుట్టి ప్రజలను మోసం చేస్తోందని, కనీసం పట్టణాభివృద్ధిపై అయినా దృష్టి సారించాలని సూచించారు. వార్డుల్లో అధికారులు పర్యటిస్తున్నప్పుడు తమకు సమాచారమివ్వాలని కోరారు. కౌన్సిలర్లు నీలావతి, దర్గా చెన్నమ్మ, లింగన్న మాట్లాడుతూ తమ వార్డుల్లో నీటి పైప్‌లైన్, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కృపాకర్ మాట్లాడుతూ మూడేళ్లుగా పనులు దక్కించుకుని, వాటిని చేయకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని, కొత్త కాంట్రాక్టర్‌ల ద్వారా పనులు చేయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో గపడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనుల్లో ఇప్పటివరకు మొదలు పెట్టని 62 పనులను రద్దు చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### బాలల సంరక్షణపై అవగాహన

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఆర్‌పీఎఫ్‌ల ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వసంతరావు ఆధ్వర్యంలో క్యాంటీన్ నిర్వాహకులు, వెండర్లు, ఆటోడ్రైవర్లకు బాలల హక్కుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలను, రైల్వేస్టేషన్‌లో బిక్షాటన చేస్తున్న పిల్లలు, డ్రగ్స్‌కు బానిసైన చిన్నారులను గుర్తించి వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాలల సంరక్షణపై ముద్రించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం డీసీపీఓ మంజునాథ్, అధికారి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక

శింగనమల: జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలకు సంబంధించి ఈనెల 28న అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పీడీ నందకుమార్ తెలిపారు. అండర్–14 రికర్వ్ విభాగంలో దాసరి హాసిని మొదటి స్థానం, అండర్–17 విభాగంలో ముంటిమడుగు లావణ్య రెండో స్థానం, ఆండర్–19 ఇండియన్ రౌండ్‌లో దండువారిపల్లి నీహారిక రెండో స్థానం, ఆండర్–14 రికర్వ్ విభాగంలో ఎంపాకుల సుస్మిత మూడో స్థానం, ఆండర్–17 రికర్వ్ విభాగంలో బెస్త దీపిక నాలుగో స్థానం, ఆండర్–19 ఇండియన్ రౌండ్ విభాగంలో బోడిగాని దొడ్డి కార్తీక్ నాలుగో స్థానం సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

గుంతకల్లు రూరల్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి రిలే పరుగు పోటీల్లో గుంతకల్లు విద్యార్థిని అమూల్య ప్రతిభ కనబరచింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న అమూల్య అనంతపురం జిల్లా తరపున మరో ముగ్గురు విద్యార్థులతో కలిసి 4x400 రాష్ట్రస్థాయి రిలే పరుగు పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్ సాలాబాయి, ఇతర అధ్యాపకులు విద్యార్థిని అమూల్యను అభినందించారు.

## జీఆర్‌పీలో ఆకట్టుకున్న ఓపెన్ హౌస్



గుంతకల్లులో ఓపెన్ హౌస్ ప్రారంభిస్తున్న జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా

గుంతకల్లు: స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో మంగళవారం అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు, ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా ప్రారంభించారు. జీఆర్‌పీ సిబ్బందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు పోలీసులు వాడే ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగులను ఎస్పీ గుర్తు చేశారు. సీఐ నగేష్‌బాబు, ఎస్‌బీ ఎస్ఐ సురేష్‌బాబు, ఏఆర్ ఎస్ఐ జగన్‌మోహన్,రెడ్డి, ఎస్ఐ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్

బుక్కరాయసముద్రం: పోలీసులు సేవలు మరువలేనివని బార్ అసోసేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని రోటరీపురం గ్రామంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్(అటానమస్) కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పోలీసు సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. అనంతరం అసువులు బాసిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మెంబర్ ఆలూరి రామిరెడ్డి, బాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వినీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుకాణదారులు నిబంధనలు పాటించాలి



తాడిపత్రిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రజాక్‌వలి

తాడిపత్రి రూరల్: టపాసుల దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలని తహసీల్దార్ రజాక్‌వలి ఆదేశించారు. పట్టణంలోని జాయ్ పార్కులో ఏర్పాటు చేసిన టాపాసుల దుకాణాలను మంగళవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా చర్యలపై దుకాణాల యజమానులతో మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

**అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు**

యల్లనూరు: అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. సీఐ మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా, పోలీసుల అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

### కల్లూరులో చోరీ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన షాకీర్ హుస్సేన్ శుక్రవారం తాడిపత్రి మండలం సజ్జలదిన్నెలోని బంధువులు ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా బావించిన దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, 22 తులాల వెండి, ఒక తులం బంగారు ఆభరణాలు దొంగలించారు. మంగళవారం ఆయన ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గమనించాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.